

ముస్తాబైన లక్ష్మీనగర్ థీమ్ పార్కు

నేడు లక్ష్మీనగర్ కాలనీ థీమ్ పార్క్ ప్రారంభోత్సవం

సైదాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో జనవరి 25న ప్రచురితమైన 'థీమ్ పార్కును ప్రారంభించేది ఎప్పుడో...' అనే కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. యుద్ధప్రాతిపదికన పెండింగ్ పనులు పూర్తిచేసి ఆదివారం ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి హాజరవుతున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపిడి రవీందర్ రెడ్డిలు తెలిపారు.

చిరంజీవికి అందెల శుభాకాంక్షలు



చిరంజీవికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న అందెల

పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన మెగాస్టార్ చిరంజీవిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ శనివారం రాత్రి ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి భవిష్యత్‌లో మరింత ఎత్తుకు ఎదగాలని అందెల ఆకాంక్షించారు.

- సరూర్‌నగర్, ఆంధ్రజ్యోతి.

మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు



మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి

మునగనూర్‌లోని మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం దేవుడి స్నానాల ఘట్టం, అనంతరం స్వామి వారి ఊరేగింపు, సాయంత్రం బోనాల ఊరేగింపు, అనంతరం ఒగ్గు బృందం చేత మల్లికార్జున స్వామి ఒగ్గు కథలను వినిపించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాల్‌రాజ్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, వీరేశంగౌడ్‌తో పాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

- హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి



కార్పొరేటర్ సుజాతనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అగ్రికల్చర్ కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి తదితరులు

అగ్రికల్చర్ కాలనీలో మార్నింగ్ వాక్


చంపాపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీలో ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించి, ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో వివిధ రహదారులపై సీసీ, బీటీ రహదారుల నిర్మాణం కోసం రూ.2కోట్లు మంజూరు చేయాలని కోరుతూ కాలనీ ప్రతినిధులు కార్పొరేటర్ సుజాతనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం అంచెలంచలుగా నిధులు మంజూరు చేయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి జితేందర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాంచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌కు దరఖాస్తును అందజేస్తున్న టీపీసీసీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం కోసం మిద్దెల జితేందర్ దరఖాస్తు

చంపాపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిచేందుకు టీపీసీసీ సేవాదళ్ అధ్యక్షుడు, చంపాపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మిద్దెల జితేందర్ గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 నుంచి తాను యూత్ కాంగ్రెస్‌లో చేరి వివిధ స్థాయిల్లో పార్టీ అభివృద్ధి కోసం పనిచేసినట్లు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడుగా పనిచేసి కార్మికులకు ఎంతో సేవ చేసినట్లు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి

సైదాబాద్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

- కొత్తకాపు అరుణ

సైదాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ కాలనీలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి అధికారులతో కలిసి ఆదివారం పాదయాత్ర చేశారు. కాలనీలో పాడైన కమ్యూనిటీ హాల్ మూసివేత, వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం, ఫుట్‌పాత్‌ల ఏర్పాటుపై కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదు

- టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొ. ఘంటా చక్రపాణి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొ.ఘంటా చక్రపాణి అన్నారు. తెలంగాణ సమాజంలో ఉన్న అసమానతల కారణంగానే యువత తిరుగుబావుటా ఎగురవేసిందన్నారు. మంగళారపు లక్ష్మణ్ రాసిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' (యదార్థ సంఘటనల సమాహారం) పుస్తక పరిచయ కార్యక్రమాన్ని రవీంద్రభారతి మినీహాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను విముక్తి చేసింది నక్సల్స్ ఉద్యమమనే నిజాన్ని సమాజానికి చెప్పాలన్నారు.

కరీంనగర్‌తోపాటు మరిన్ని ప్రాంతాల చరిత్ర రాయాల్సిన అవసరముందన్నారు. మార్కెట్‌కు వచ్చిన రైతులను భూస్వాములు వేధించేవారని, కులవివక్ష తీవ్రంగా ఉండటంతో హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో నక్సల్ ఉద్యమాలు జరిగాయన్నారు. ఆకలితో ఉన్న వారితోపాటు ఆకలి బాధ తెలిసిన ఎంతోమంది నక్సల్ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. చరిత్రలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు తెలిపేందుకు తెలంగాణ సమాజంలో జరిగిన ఉద్యమాలపై ప్రత్యేక పుస్తకాలు రావాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ తొలి చైర్మన్ వి.ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమస్ఫూర్తిని చంపేశారని, మళ్లీ ఉద్యమస్ఫూర్తి రావాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ తెలుగునాట జరిగిన నక్సల్ బరి ఉద్యమంలో ఉన్నత చదువులు చదువుకున్న ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారన్నారు. మాయని గాయాల నెత్తుటి చరిత్ర వంటి పుస్తకాలు మరిన్ని రావాలన్నారు. తెలంగాణలో విప్లవం సృష్టించిన ఎంతోమంది మేధావుల గురించి సమాజానికి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, రచయిత జాకీర్, పుస్తక రచయిత మంగళారపు లక్ష్మణ్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సి.విఠల్, రచయిత డా.తైదల అంజయ్య, సీనియర్ పాత్రికేయులు తులాయిల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి .. అగ్నిమాపక సిబ్బంది బెదిరింపులు



లక్ష్మీనగర్‌లోని జాష్ణవి మిర్చి పాయింట్



బాధిత వ్యాపారిసురేశ్

సైదాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మిర్చి పాయింట్ వ్యాపారిని మలకపేట అగ్నిమాపక శాఖ సిబ్బంది బెదిరించి డబ్బులు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత వ్యాపారి వివరాలు వెల్లడించారు. ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్‌లో ఓ యువకుడు మిర్చి పాయింట్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 2న రాత్రి మలక్‌పేట అగ్నిమాపక శాఖ సిబ్బంది ముగ్గురు వచ్చి మిర్చి పాయింట్‌లో రెండు గృహావసరాల సిలిండర్లను స్వాధీనం చేసుకుని వాహనంలో తీసుకుని వెళ్లిపోయారు. కొద్దిసేపటికి సమీప ప్రాంతానికి పిలిచి రూ.15వేలు ఇవ్వాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో బాధితుడు వారిని బతిమలాడి రూ.5వేలు ఇచ్చి సిలిండర్లు తీసుకున్నాడు. ఈ విషయం బయటకు పొక్కింది. అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అగ్నిమాపక సిబ్బంది మిర్చి పాయింట్‌కు వచ్చి సిలిండర్లు తీసుకుపోయే దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డు అయ్యాయి.

మన్సూరాబాద్‌లో గంజాయి పట్టివేత

- 1.30 కేజీల గంజాయి, బైకు, రెండు సెల్ ఫోన్స్ స్వాధీనం
- నలుగురు అరెస్టు, పరారీలో ఇద్దరు

కొత్తపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని మన్సూరాబాద్‌లో పోలీసులు గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి 1.30 కేజీల గంజాయి, ఒక బైకు, రెండు సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు. ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఎస్ఐ లింగారెడ్డి కథనం ప్రకారం... నల్లగొండ జిల్లా కనగల్ మండలం లచ్చిగూడెం గ్రామానికి చెందిన గజ్జి సాయిశ్రీకాంత్ (21) మన్సూరాబాద్‌లో అద్దె గదిలో ఉంటూ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించడానికి గంజాయి కొనుగోలు చేసి మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలో ఉండే కారు మెకానిక్ తుడుం ధనుంజయ్(19)తో కలిసి యువకులకు గంజాయి విక్రయించడం మొదలుపెట్టాడు. జగిత్యాల కొడిమ్యాల్‌కు చెందిన అడ్లగట్ట హర్షన్(21), కల్వకుర్తి మిడ్జిల్‌కు చెందిన లింగేశ్వర మల్లికార్జున్(20) టీకేఆర్ కమాన్ సమీపంలో గల సిద్ధి వినాయక హాస్టల్‌లో ఉంటూ హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్నారు. అడ్లగట్ట హర్షన్, లింగేశ్వర మల్లికార్జున్ గంజాయి కొనుగోలు చేసేందుకు మన్సూరాబాద్ పెట్రోల్ బంకు వద్దకు వచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు పెట్రోల్ బంకు వద్ద గంజాయి విక్రయిస్తున్న గజ్జి సాయిశ్రీకాంత్, తుడుం ధనుంజయ్‌లను, గంజాయి కొనేందుకు వచ్చిన ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. మరో ఇద్దరు నిందితులు అఖిల్, శివ పరారీలో ఉన్నారు. .

నేటి నుంచి 'బస్తీ చలో అభియాన్'

- మోదీ పాలనను ఇంటింటికీ తీసుకెళ్తాం : బీజేపీ



మాట్లాడుతున్న సామరంగారెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆదివారం ఎల్బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 5 నుంచి 8 వరకు 'బస్తీ చలో అభియాన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. జాతీయ స్థాయి నాయకుడి నుంచి పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్త వరకు బస్తీ చలో అభియాన్‌లో పాలుపంచుకుంటారని పేర్కొన్నారు.

పదేళ్లలో మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అన్నివర్గాల ప్రజలకు వివరించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గౌరవాన్ని పెంచిన తీరు, ఆర్థికంగా దేశాన్ని అభివృద్ధి చేసిన తీరును ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వాలకు, మోదీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాలను తెలపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రుద్రారపు శంకర్, బొగ్గుల మాధవ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నిరంతర పోరాటం



ఏఐటీయూసీలో చేరుతున్న బీఎంఎస్ ఆటో ట్రాలీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఏఐటీయూసీ నిర్వహిస్తున్న పోరాటాలకు ఆకర్షితులై ఎంతో మంది కార్మికులు సంఘంలో చేరుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇ.వెంకటేశ్, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.చందు పేర్కొన్నారు. బీఎంఎస్ సంఘానికి చెందిన పలువురు ఆటో ట్రాలీ డ్రైవర్స్ ఆదివారం నాగోల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా వెంకటేశ్, చందు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ట్రాఫిక్ పోలీసులు, ప్రైవేటు ఫైనాన్షియర్ల వేధింపులకు వ్యతిరేకంగా కూడా తమ సంఘం పోరాడుతుందన్నారు. ఈనెల 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక లోకమంతా పాల్గొనాలని, మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఫైమిదా, యూనియన్ నాయకులు మహేందర్, సేవియానాయక్, శ్రీనివాస్, పాషా, సహేదాబేగం, ఆరెకటిక రాములు, కొమ్ము రాములు, వెంకటేశ్, రాయుడు, ప్రమీల, మున్నా పాల్గొన్నారు.

జీబీఆర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



జీబీఆర్ కాలనీ నూతన కార్యవర్గం ప్రతినిధులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడ 7వ డివిజన్‌లోని జీబీఆర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గుర్రం భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడిగా జి.కరుణాకర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా రామశంకర్‌శర్మ, శోభన్ బాబు, కోశాధికారిగా వై.లక్ష్మణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా అడప గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా కట్టా ప్రసాద్, చేగోని రాజుగౌడ్‌లు ఎన్నికయ్యారు.

ఆదిత్యానగర్ కాలనీ కార్యవర్గం

గుర్రంగూడ 7వ డివిజన్‌లోని ఆదిత్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఇక్కడి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుట్టగల్ల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రంనేని శ్రీనివాస చౌదరి, ఉపాధ్యక్షులుగా టి.శుక్లాచారి, పి.అవినాశ్, కె.సత్యంచారి, సంయుక్త కార్యదర్శులుగా ఎం.అనిల్‌రెడ్డి, వి.ఉపేందర్‌రెడ్డి, పురుషోత్తం, పి.జంగయ్యగౌడ్, ఆర్.నరేశ్‌చారి, వి.సాజు నాయక్, కోశాధికారులుగా యు.శ్రీనివాస్‌చారి, ఎస్ఆర్ ప్రసాద్, ప్రధాన సలహాదారులుగా టి.నర్సింహులు, పి.సైదులు, ఎస్.శ్రీనివాస్‌గౌడ్, ఎ.రాజిరెడ్డి, ఎన్.జబ్బార్ అలీ, సభ్యులుగా వి.రాజేశ్‌కుమార్, ఎం.మల్లేశ్ గౌడ్, కె.రామాచారి, బి.మహేశ్, ఇ.కృష్ణ, ఎం.నరేందర్, ఆర్.శేఖర్‌చారి ఎన్నికయ్యారు.

టీచర్స్ కాలనీ అధ్యక్షుడిగా బుచ్చిరెడ్డి

మీర్‌పేట్ కార్పొరేషన్ 9వ డివిజన్‌లోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎ.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాగేశ్వర్‌రావు, కోశాధికారిగా డి.సంతోష్, సంయుక్త కార్యదర్శిగా కె.రవీందర్‌రెడ్డి, సభ్యులుగా కె.అచ్యుత్ రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, ఎం.శివకుమార్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.



కేరళ మంత్రి జె.చించురాణికి మెమెంటో బహూకరిస్తున్న క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్, అధికారులు

జూపార్కును సందర్శించిన కేరళ మంత్రి, టర్కీ కాన్సులేట్ జనరల్

మదీన, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్ర మంత్రి జె.చించురాణి, టర్కీ కాన్సులేట్ జనరల్ ఒర్హాన్ యాల్మన్ ఒకన్ ఆదివారం వేర్వేరుగా జూపార్కును సందర్శించారు. క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరమెత్, జూ అధికారులు వారికి స్వాగతం పలికారు. జూపార్కులోని వివిధ విభాగాల పనితీరును వివరించారు. యానిమల్ ఎన్‌క్లోజర్లు, సఫారీ పార్కు, రెప్టైల్ హౌజ్‌తోపాటు జంతువులకు అందిస్తున్న వైద్య సేవలు, కొద్దిరోజులుగా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ల గురించి వివరించారు. జూపార్కు నిర్వహణ బాగుందని కేరళ మంత్రి పేర్కొన్నారు. కేరళ, తెలంగాణ రాష్ట్రాల మధ్య జూపార్కుల్లోని జంతువుల మార్పిడి గురించి చర్చించారు. జూపార్కు నిర్వహణపై టర్కీ కాన్సులేట్ జనరల్ సంతృప్తి వ్యక్తం చేశారు.

కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

- పార్టీ అధ్యక్షుడు కిషన్‌గౌడ్ పిలుపు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6వ తేదీన మన్నెగూడలోని వేద కన్వెన్షన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తిగౌడ్, మొగుళ్ల జీవన్‌రెడ్డి, రాజారాంచారి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్ కరపత్రాల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం అనాజ్‌పూర్‌లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, జంగయ్య, శివకుమార్, అంజయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



హయత్‌నగర్ జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించిన సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పోటీ పరీక్షలను ప్రారంభిస్తున్న నక్క శ్రీనివాస్‌యాదవ్

జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పోటీ పరీక్షలు

హయత్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని జిల్లాపరిషత్ పాఠశాలలో సోషల్ ఫోరం, గాంధీ సంస్థలు, నక్క శ్రీనివాస్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పోటీ పరీక్షలు శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలకు రంగారెడ్డి జిల్లాలోని 62 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. నక్క శ్రీనివాస్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ హాజరై పోటీ పరీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర అధ్యక్షతన జరిగింది. పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఇందిర మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలో ఈ పోటీ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 10వ తేదీన రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగించేందుకు ఈ పోటీ పరీక్షలు దోహదపడుతాయన్నారు. అనంతరం గాంధీ గ్లోబల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 2024 క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యానాల ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రతంగపాణి, గణేష్ గౌడ శెట్టి, సురేందర్, సుభాష్ చంద్రతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గార్బేజ్ డంపింగ్ యార్డుగా ఓపెన్ ప్లాట్లు

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన రిటైర్డ్ ప్రొఫెసర్

ఎల్బీనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ప్లాట్లు గార్బేజ్ డంపింగ్ యార్డుగా తయారవుతున్నాయని రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌కు ఫిర్యాదు చేశారు. అల్కాపురికాలనీలోని రోడ్ నంబర్ 14లో ఓపెన్ ప్లాట్ల ఓనర్లతో పాటు జీహెచ్ఎంసీ స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్ల ఓపెన్ ప్లాట్లలో చెత్త పేరుకుపోతున్నదని ఆయన చెప్పారు. తక్షణమే ఓపెన్ ప్లాట్లలో చెత్తను తొలగించి ప్రజలు వ్యాధులబారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎండీ ముషారఫ్

విద్యుత్ గుత్తేదారుల సంఘం-2024 క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్బీనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ గుత్తేదారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శివకుమార్, ఎస్.కె.మాజిద్, ప్రతినిధులు సదానందం, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.